క్లుప్తంగా

పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన



మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గాజువాక: పొగాకు ఉత్పత్తులు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ అధికారి ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. వాటిని ఉపయోగించేవారు ఎలా పతనమవుతున్నారో ఈ సందర్భంగా వివరించారు. వాటిని ఉపయోగిస్తున్న వారి వల్ల సమాజంలో తలెత్తుతున్న ఇబ్బందులను, జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవోలు వై.ఎన్.వి.లక్ష్మి, పావని, సంతోషి పాల్గొన్నారు.

వర్గీకరణపై మాలల సమావేశం నేడు

ఉక్కునగరం: ఎస్సీ వర్గీకరణపై ఆదివారం మాల మహానాడు సమావేశం ఏర్పాటు చేసినట్లు మాల మహానాడు నాయకులు బూల జగ్జీవన్‌రామ్, మాటూరి శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 7 గంటలకు స్టీల్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు. సమావేశానికి స్టీల్‌ప్లాంట్, పరిసర ప్రాంత మాలలందరూ హాజరై వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.

ఘనంగా అగ్రినోవా ఫెస్ట్



స్టాళ్లను సందర్శిస్తున్న తల్లిదండ్రులు

గాజువాక : స్థానిక రవీంద్ర భారతి స్కూల్లో అగ్రినోవా ఫెస్ట్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయం ప్రాముఖ్యతను తెలుపుతూ చిన్నారులు ఏర్పాటు చేసిన స్టాళ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త సూరిబాబు ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో వ్యవసాయం అతి పెద్ద కీలకాంశమని అన్నారు. ఒక నిర్దిష్టమైన పద్ధతిలో మొక్కలు, జంతువులను పెంచి, పోషించాలన్నారు. వెటర్నరీ సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవ నాగరికత పెరుగుదలకు తోడ్పాటునందించడంలో వ్యవసాయానిది కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుబ్రహ్మణ్యం, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, సీజీఎం వసంత, జీఎం రమ్య, ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి

అక్కిరెడ్డిపాలెం: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య (80)కు భెల్ సీపీఎం నాయకులు శనివారం నివాళులర్పించారు. నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి 11 సంవత్సరాల పాటు అవినీతి లేని స్వచ్ఛమైన పరిపాలన అందించిన ముఖ్యమంత్రి బుద్ధదేవ్ అని కొనియాడారు. భావితరాలకు ఆయన స్ఫూర్తిప్రదాత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.విజయ్‌కుమార్, ఎస్.జగన్నాధరావు, కె.నారపురెడ్డి, అప్పారావు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎల్‌సీపై రాష్ట్రపతికి ఫిర్యాదు

అగనంపూడి: ఆర్ఎల్‌సీ వైఖరిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు ఉక్కు కార్మిక సంఘం నాయకుడు పట్టా రామ అప్పారావు తెలిపారు. ఆధార్ కార్డు ఆధారంగా పుట్టిన తేదీని నిర్ధారించిన ఉక్కు హార్టికల్చరల్ సొసైటీ పాలకవర్గం డి.అప్పలకొండ అనే కార్మికురాలిని తొలగించిందని తెలిపారు. వాస్తవంగా ఈఎస్ఐ, ఈపీఎఫ్ కార్డులపై పుట్టిన తేదీ ఉండగా వాటిని కాదని, ఆధార్‌ను ఆధారం చేసుకుని తొలగించడంపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) తీరు ఆక్షేపణీయమని పేర్కొంటూ రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

తుప్పలు ఇలా.. ప్రయాణమెలా?



ప్రమాదకరంగా ఉన్న మలుపులు

- మలుపుల వద్ద కానరాని మార్గం
- వాహనచోదకుల ఇక్కట్లు
- తరచూ ప్రమాదాలు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

పెదగంట్యాడ: దట్టంగా అల్లుకున్న పొదలు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు వాహనచోదకులకు ప్రయాణాన్ని నరకప్రాయంగా మార్చాయి. సక్రమంగా దారి కనిపించక మలుపుకో గండం అన్నట్లుగా ఉందీ పరిస్థితి.

మండలంలోని యారాడ తీరం ప్రత్యేకం. ఈ ప్రాంతంలో సేద తీరాలని నిత్యం వేలాదిమంది అక్కడికి వెళ్తుంటారు. పర్యాటకుల సంఖ్య కూడా ఎక్కువే. అయితే ఈ తీరానికి వెళ్లాలంటే పెదగంట్యాడ నుంచి గంగవరం మీదుగా ప్రయాణించాలి. ఈ రహదారి మొత్తం కొండలపై నుంచి, అదీ ఘాట్ రోడ్డు మీదుగా ప్రయాణించాలి. సుమారు ఆరు కిలోమీటర్ల మేర ఈ రోడ్డు విస్తరించి ఉంది. అయితే, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో దారి కనిపించడం లేదు.

కానరాని హెచ్చరిక బోర్డులు

ప్రమాదకరమైన మలుపు ఉన్నా ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు కూడా కనిపించకపోవడంతో వాహనచోదకులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించకుండా దూసుకుపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరిగినా అధికారులు మాత్రం తుప్పలను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాల మీదకు వచ్చినా పట్టించుకోవడం లేదు. సెలవు రోజుల్లో కుటుంబాలతో కలిసి యారాడ వెళ్లే వారు ఎక్కువగా ఉంటారు. ఈ రహదారి ప్రమాదకరంగా మారడంతో వారంతా భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యారాడ రోడ్డులో ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించాలని కోరుతున్నారు. అలాగే, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

తుప్పలు తొలగించాలి



మేము వారంలో ఒక రోజు యారాడ బీచ్‌కు కుటుంబంతో, స్నేహితులతో కలిసి వెళ్తుంటాం. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో రోడ్డు కనిపించడం లేదు. యారాడ తీరానికి వెళ్లేందుకు పెదగంట్యాడ నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనాల్లోనో, కార్లలోనో వెళ్లాల్సి వస్తోంది. తుప్పల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అధికారులు స్పందించి పర్యాటక ప్రాంతానికి వెళ్లే రోడ్డులో తుప్పలు తొలగించాలి.

– కొండకంచి రాజు, నడుపూరు, పెదగంట్యాడ

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి

- ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ తనిఖీ



స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ బాగ్చి

ఉక్కునగరం: పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలు ఓపికతో విని పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ సెక్టార్లలో దొంగతనాలు జరగకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాల నియంత్రణకు దోహదం చేస్తుందన్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా మార్గాలను కట్టడి చేయాలని ఆదేశించారు.

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. సిబ్బంది అధికార దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం క్షమించబోనన్నారు. ముందుగా స్టేషన్ ఆవరణ అంతా కలియ తిరిగారు. ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చేసి మొక్కలు నాటాలని సూచించారు. క్రైమ్ రికవరీ ప్రాపర్టీని క్లియర్ చేయాలని, ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది వ్యక్తిగత, కుటుంబ పరమైన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు



బహుమతులతో విజేతలు

గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్–13 కేటగిరీలోని ఓపెన్, బాలికల విభాగంలో నిర్వహించిన ఈ పోటీలను లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు పాలపర్తి సత్యానందం ప్రారంభించారు. సుమారు 200 మంది బాల బాలికలు పాల్గొన్న ఈ పోటీల్లో బాలుర విభాగంలో తనిష్ మొదటి స్థానాన్ని, వంశీ రెండో స్థానాన్ని సాధించారు. బాలికల విభాగంలో గొర్లె నైన మొదటి స్థానం, లహరి ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రొంగల బాబూరావు, మణికంఠ, కోశాధికారి ఉమా మహేశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యాల కోటేశ్వరరావు, పోలిశెట్టి లక్ష్మణ్, బలివాడ సత్యారావు, నున్న శ్రీనివాసరావు, బోయిన బాబూరావు, భోగవిల్లి రఘురామ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం



బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న న్యాయవాదులు



న్యాయమూర్తులతో క్రీడాకారులు

గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యుడీషియల్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉక్కు మైదానంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలను సుహృద్భావ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. నిత్యం కేసులు, వాదోపవాదాలు, తీర్పులతో మానసిక ఒత్తిడికి గురవుతున్న న్యాయవాదులకు కొంత ఆటవిడుపుగా ఈ క్రీడలు ఉపయోగపడాలన్నారు. వివిధ క్రీడల్లో విజయం సాధించిన వారికి ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులను ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ న్యాయవాది మేకా పట్టాభి రామారావు ఈ పోటీలకు సంధానకర్తగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, ఏపీపీలు పావని, తిరుమలమ్మ, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ప్రసన్న, శాంతి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

థాయ్‌లాండ్ వేదికపై విశాఖ చిన్నారి



చిహ్నికకు విజయ కిరీటం అలంకరిస్తున్న నిర్వాహకులు

గాజువాక : ప్రపంచ దేశాల పిల్లల మధ్య జరిగిన మోడలింగ్ పోటీల్లో విశాఖకు చెందిన చిన్నారి ప్రతిభ కనబరిచింది. గాజువాక ప్రాంతానికి చెందిన ఏడేళ్ల చిహ్నిక థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని విజయం సాధించింది. వివిధ దేశాల్లో జరిగిన పోటీల్లో విజేతలతో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ టోడ్లర్ విభాగంలో మొదటి స్థానాన్ని సాధించడంతో పాటు ఎక్స్‌ట్రీమ్ టాలెంట్, బెస్ట్ ఇంట్రడక్షన్ సబ్ టైటిల్స్‌ను సొంతం చేసుకుంది. పదిహేను దేశాల చిన్నారులు పాల్గొన్న ఈ పోటీల్లో చిహ్నిక విజయఢంకా మోగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘కోరమాండల్’ వితరణ

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు 50 స్టాపర్లు అందజేత



ట్రాఫిక్ పోలీసులకు స్టాపర్స్ అందిస్తున్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: మల్కాపురం, గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ 50 స్టాపర్స్‌ను అందించింది. మల్కాపురం స్టేషన్ వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో కోరమాండల్ డీజీఎం (హెచ్ఆర్) ఆర్.శ్రీనివాసరావు వీటిని పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని, పలు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు స్టాపర్లు అందించామన్నారు. తద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వచ్చన్నారు. మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ కోరమాండల్ వారు ఇచ్చిన ఈ స్టాపర్స్‌ను ముఖ్య కూడళ్లలో, స్కూల్ జోన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) నారాయణపాత్రుడు, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ కె.శ్రీకాంత్, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణను పునఃసమీక్షించాలి’



మాట్లాడుతున్న విదసం కార్యదర్శి వెంకటరావు

అగనంపూడి: ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పును పునఃసమీక్షించాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి (విదసం) కన్వీనర్ బూసి వెంకటరావు విజ్ఞప్తి చేశారు. విదసం ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల ఒకటిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి విరుద్ధమని, ఈ విషయంలో ధర్మాసనం పునః సమీక్షించాలని కోరారు. తీర్పుపై కోర్ కమిటీ దిశా నిర్దేశం చేయాలన్నారు. తీర్పులోని అంశాలు, క్రిమిలేయర్, వర్గీకరణ, తద్వారా ఎస్సీ ఉపకులాలకు ఉమ్మడి ప్రయోజనాలపై విస్తృత చర్చ జరగాలన్నారు. కార్యక్రమంలో విదసం ప్రతినిధులు వడ్లపూడి ఫ్రాన్సిస్, తిరుపతిరావు, బొంతా శ్యామ్ రవిప్రకాష్, గుబ్బల శ్రీనివాసరావు, పాల పోలారావు, ఈతలపాక సుజాత, సోడాదాసిర సుధాకర్, చంద్రశేఖర్, ఎల్లాజీ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

భెల్ కార్మికులకు రిస్ట్‌వాచ్‌ల అందజేత

పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి బహూకరణ



కార్మికులకు రిస్ట్ వాచ్‌లు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) సీనియర్ కార్మికులకు శనివారం రిస్ట్ వాచ్‌లు అందజేశారు. పది సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులకు సంస్థలోని అన్ని యూనిట్లలో వీటిని అందించారు. 30 ఆగస్టు 2013 నుంచి 30 ఆగస్టు 2023 వరకు 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్మికులు, రిటైర్ అయిన కార్మికులు 430 మందికి టైటాన్ వాచ్‌లను అందజేశారు. గుర్తింపు యూనియన్ ప్రతినిధుల చేతుల మీదుగా ఉన్నతాధికారులు ఈ వాచ్‌లను అందించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) జి.చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ నాయకులు బొండ బాబూరావు, సుభాకర్ సాహు, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, వెంకటేశ్వర్లు, వారణాసి గోవిందరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో పలు సబ్జెక్టులు బోధించేందుకు ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్. రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్, నకలు ధ్రువ పత్రాలతో ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో తరగతులకు హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రవేశాలకు 14వ తేదీన డెమో తరగతులు నిర్వహించనున్నట్లు ప్రకటన విడుదల చేశామని, అయితే తేదీ మార్పు జరిగి 12నే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో ప్రోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అదే విధంగా బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులను, బాలికల పాఠశాలకు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి కార్యాలయం ఫోన్ నంబర్ 0891 2799641లో సంప్రదించాలన్నారు. దేవరాపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జేఎల్ తెలుగు, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ జువాలజీ, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రీ, నర్సీపట్నం బాలికల గురుకులంలో పీజీటీ సోషల్ సబ్జెక్టుల్లో బోధించడంతో పాటు గొలుగొండ బాలుర గురుకులంలో పీడీ, పీఈటీ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి



జ్యోతి వెలిగించి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సూర్యాబాగ్ పోలీస్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యంతో లక్ష్య సాధన దిశగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ ప్రాముఖ్యతను వివరించారు. పాపాహోం అభివృద్ధికి తోడ్పడుతున్న కమిటీ సభ్యులను, దాతలను సీపీ అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్లామ్ అరిఫ్, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేబీ స్వామి, పాపాహోం సభ్యులు ఎంవీ రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ, కృష్ణారావు ఆచారి, భాస్కర శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

6వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు..

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు శనివారం 6వ రోజుకి చేరాయి. అమ్మవారికి విశేషపూజ నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. 30 మంది భక్తులు విశిష్ట శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత వివక్షతో కూడిన చట్టాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య (సీపీపీసీ) ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ 1950 ఉత్తర్వులకు నిరసనగా జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ 1960లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ క్రైస్తవ మైనారిటీలకు మాత్రమే వర్తించేలా మత స్వతంత్ర నిరోధక చట్టాలకు తెరలేపారని గుర్తు చేశారు. ఫలితంగా ఆగస్టు 10న బ్లాక్‌డేగా ప్రకటించి దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను మతం మారిన క్రైస్తవ మైనారిటీలకు కుల నిర్మూలన చేస్తూ అదర్ క్రిస్టియన్ పేరిట ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న చట్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో క్రైస్తవులు, సమాఖ్య సభ్యులు పలు ప్రాంతాల మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎం.సుధాకర్‌పాల్, జేమ్స్ కుంపట్ల, కె.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్, బిషప్ ఎంఏ పాల్, పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన సింహగిరి



సింహగిరిపై క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, గంగధార ప్రాంగణం కిక్కిరిశాయి. సింహగిరికి వెళ్లే ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రద్దీని సంతరించుకున్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లతో పార్కింగ్ స్థలాలన్నీ నిండుకున్నాయి. దేవస్థానం కార్యాలయ ఉద్యోగులంతా సింహగిరిపై డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించారు.